నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 20 సెప్టెంబర్ 2024 | KHAMMAM

ఆరోగ్య రంగంలో జిల్లాను ముందుంచాలి

వైద్యారోగ్య శాఖ అధికారుల సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీజ

సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

ఖమ్మం సిటీ, సెప్టెంబర్ 19: ఆరోగ్య రంగంలో ఖమ్మం జిల్లాను ముందుంచాలని అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ ఆకాంక్షించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యక్రమాలపై ఆ శాఖ ప్రోగ్రాం అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలన్నీ లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలని సూచించారు. ప్రతీ సోమవారం మండల కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించి శాఖాపరమైన సమస్యల గురించి చర్చించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును మెరుగుపర్చుకొని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. మాతా శిశు సంక్షేమం, వ్యాధి నిరోధక టీకాలు, ఆర్‌బీఎస్‌కే, జాతీయ కీటక జనిత వ్యాధులు, లెప్రసీ, హెచ్‌ఐవీ, అసంక్రమణ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యల గురించి చర్చించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వరికూటి సుబ్బారావు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ సైదులు, డాక్టర్ సీతారాం, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చందునాయక్, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ రామారావు, డీపీహెచ్ఎన్‌వో శేషుపద్మ, డెమో సాంబశివారెడ్డి, డీపీవో దుర్గ పాల్గొన్నారు.

సాగర్ కాలువ గండ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చాలి

ఏ ఒక్క రైతుకూ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలి

అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 19: సాగర్ ఎడమ కాలువ గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూడ్చాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఇటీవలి వర్షాలు, వరదల కారణంగా నాగార్జునసాగర్ ఎడమ కాలువకు పలు చోట్ల గండ్లు పడ్డాయని అన్నారు. దీంతో ఆయా గండ్లను పూడ్చి కాలువల మరమ్మతు పనులు త్వరగా చేపట్టాలని నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జాకు సూచించారు. కాగా, కొన్నిచోట్ల కాలువల మరమ్మతు పనులు నత్తనడకన సాగుతుండడంతో ఆయా అధికారులపై మంత్రి తుమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఒక్క రైతుకూ నష్టం లేకుండా, పంటలు ఎండిపోకుండా యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి వృథాను అరికట్టేందుకు ఎక్కడా గండ్లు లేకుండా చర్యలు చేపట్టాలని, కాలువ కట్టలను పటిష్టం చేయాలని, చివరి ఆయకట్టు రైతులకూ సాగునీరు అందించాలని సూచించారు.

గండ్లు పూడ్చి సాగునీరివ్వండి: సండ్ర

సత్తుపల్లి టౌన్, సెప్టెంబర్ 19: ఇటీవలి భారీ వర్షాలు, వరదలతో జిల్లాలో దెబ్బతిన్న నాగార్జున సాగర్ ఎడమ కాలువ గండ్లను త్వరితగతిన పూడ్చి రైతుల పంటలకు సాగునీరు అందించాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. గండ్లను వెంటనే పూడ్చకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని అన్నారు. అలాగే కల్లూరు, పెనుబల్లి మండలాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయకపోవడం వల్ల పంట పొలాలకు నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని సండ్ర విజ్ఞప్తి చేశారు.

పాఠాల బోధన ఇంకెప్పుడు?

- నాలుగు నెలలైనా చలనంలేని విద్యాశాఖ
- కేజీబీవీల్లో 38 అధ్యాపక పోస్టులు ఖాళీ
- చాలా సబ్జెక్టుల్లో మొదలుకాని సిలబస్
- సీనియర్ ఇంటర్ విద్యార్థినుల భవిష్యత్ ప్రశ్నార్థకం
- బోధన లేకుంటే ఫలితాలు, పోటీ పరీక్షలపై ప్రభావం
- కొన్నిచోట్ల టీసీలు తీసుకొని వెళ్తున్న విద్యార్థినులు

ఖమ్మం అర్బన్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 19 : విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీ)లో పాఠ్యాంశాల బోధన ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో 'పాఠాలు బోధించండి మహాప్రభో..' అంటూ విద్యార్థినులు వేడుకుంటున్నారు. దీంతో చదువుతో తమ భవిష్యత్‌ను బంగారుమయం చేసుకుందామని కలలుగంటున్న వారి ఆశలు అలాగే మిగిలిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఎన్నో కష్టాలను ఓర్చుకుంటూ చదువును కొనసాగించేందుకు కేజీబీవీల్లో చేరిన ఆయా విద్యార్థినులకు చదువు చెప్పేవారు లేకపోవడమే పెద్ద సమస్యగా మారింది. విద్యాసంవత్సరం ప్రారంభమై ఇంత కాలం గడుసున్నా ప్రభుత్వం ఇంకా చోద్యం చూస్తుండడంతో సీఆర్‌టీ, పీజీసీఆర్‌టీలు ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఇంటర్ సిలబస్‌లు ఇప్పటికే దాదాపుగా పూర్తయ్యాయి. కానీ.. కేజీబీవీల్లో మాత్రం కొన్ని సబ్జెక్టుల్లో సిలబస్‌లు ఇంకా మొదలే కాలేదు.

విద్యార్థినుల భవిష్యత్‌పై తల్లిదండ్రుల ఆవేదన

పాఠాలు బోధించేందుకు అధ్యాపకులు లేకపోవడంతో కేజీబీవీ విద్యార్థినుల తల్లిదండ్రులు స్పెషల్ ఆఫీసర్లను ప్రశ్నిస్తున్నారు. తమ పిల్లల భవిష్యత్ ఏమిటంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కేజీబీవీల్లో ఇటీవల కొందరు విద్యార్థినులు టీసీలు తీసుకొని వేరే స్కూళ్లలో చేరారు. దీని గురించి స్పెషల్ ఆఫీసర్లు ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తే.. 'భర్తీ చేస్తాం..' అనే సమాధానమే తప్ప పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలే లేకుండాపోయాయి. దీంతోపాటు కొందరు ఆరు నెలలు మెటర్నిటీ సెలవుల్లో ఉంటే వారి స్థానాల్లో ఇంకొకరిని భర్తీ చేయడం లేదు. స్కూళ్లలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినట్లు కేజీబీవీల్లో సర్దుబాటు చేసే అవకాశం లేకపోవడం, ఒకటి కంటే ఎక్కువ పోస్టులు లేకపోవడం వంటివి కూడా సమస్యల పెరుగుదలకు కారణమవుతున్నాయి.

ప్రారంభం కాని పాఠాలు..

- సింగరేణి కేజీబీవీలో ఇంటర్మీడియట్ బైపీసీ చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థి నులకు ఈ విద్యాసంవత్సరం జువాలజీ సబ్జెక్టులో పాఠాలు చెప్పేవారే లేరు. ద్వితీయ సంవత్సర విద్యార్థినులు ఇంటర్ పరీక్షల తోపాటు ఎప్‌సెట్, నీట్ వంటి పోటీ పరీక్షలకు సైతం హాజరవుతుంటారు. ఈ క్రమంలో ఇప్పటికీ సిలబస్ ప్రారంభం కాకపోతే ఇంటర్ సిలబస్‌తోపాటు ఎప్‌సెట్, ప్రాక్టికల్స్ వంటివి పూర్తి చేయగలరనేది ప్రశ్నార్థకంగా ఉంది.
- ఎర్రుపాలెం కేజీబీవీ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సీఆర్‌టీ, పీజీసీఆర్‌టీ ఖాళీలతో విద్యార్థినులకు విద్యను అందించలేని దుస్థితి. తెలుగు, ఇంగ్లిష్, ఫిజికల్ ఎడ్యుకేషన్, బయోలాజికల్ సైన్స్, పీజీసీఆర్‌టీలో గణితం, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో అధ్యాపకుల పోస్టులు ఖాళీలు ఉన్నాయి. ఆరు సబ్జెక్టుల బోధనా స్థానాలు ఖాళీగా ఉండడంతో పాఠశాల విద్యార్థినులకు, ఇంటర్ విద్యార్థినులకు సిలబస్‌లు పూర్తి కావడం పెద్ద గండంగా మారింది. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే జిల్లాలో 14 కేజీబీవీలు ఉండగా.. సీఆర్‌టీ, పీజీసీఆర్‌టీల్లో 38 ఖాళీలు భర్తీ చేయకుండా ఉండడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

పర్యవేక్షణ లోపం..

కేజీబీవీల్లో పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో జెండర్ ఈక్వాలిటీ కోఆర్డినేటర్(జీఈసీవో)గా పని చేసిన భూలక్ష్మి అనారోగ్య సమస్యలతో ఆ పోస్టు నుంచి రిలీవ్ అయ్యారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలో అటు అడ్మిషన్లు, ఇటు బదిలీల సమయంలో పర్యవేక్షణాధికారి పూర్తిస్థాయిలో లేరు. దీంతో కేజీబీవీల సమస్యలు ఎక్కడివక్కడే మిగిలిపోయాయి. తర్వాత అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఏఎంవో)కి అదనపు బాధ్యతలు అప్పగించారు. కానీ.. ఆ అధికారికి తన మాతృ శాఖ బాధ్యతలే తలకు మించిన భారంగా మారడంతో కేజీబీవీలకు న్యాయం చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ఆ పోస్టులో 2023 నిర్వహించిన పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసిన సునీతను నియమించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఈ అధికారికి కేజీబీవీలపై అవగాహన వచ్చి, పట్టు సాధించేసరికి మరో రెండు నెలలైనా పట్టే అవకాశం ఉంది. ఈలోగా విద్యాసంవత్సరం ఇంకొన్ని నెలలు గడిచిపోయే అవకాశం ఉంది.

త్వరలో భర్తీ చేస్తాం..

కేజీబీవీల్లో పనిచేసిన సీఆర్‌టీ, పీజీసీఆర్‌టీలు ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా రిలీవ్ అయ్యారు. గురుకులాల్లో ఉద్యోగాలు రావడంతో మరికొందరు వెళ్లిపోయారు. దీంతో కేజీబీవీల్లో ఏర్పడిన ఖాళీలను గుర్తించాం. ఉన్న తాధికారుల ఆదేశాలతో త్వరలో ఆయా పోస్టులను భర్తీ చేస్తాం. విద్యార్థినులకు విద్యాబ్యాసానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

–సోమశేఖర శర్మ, డీఈవో, ఖమ్మం

స్కూల్ గ్రాంట్స్ విడుదల

'నమస్తే' కథనానికి స్పందన

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 19 : పాఠశాలల నిర్వహణకు అవసరమైన స్కూల్ గ్రాంట్స్ విడుదలయ్యాయి. ఖమ్మం జిల్లాలోని 989 ప్రాథమిక పాఠశాలలు, 218 ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 1,207 పాఠశాలలకు రూ.1.52 కోట్ల నిధుల విడుదలకు అనుమతి కోసం విద్యాశాఖాధికారులు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు ఫైల్ పెట్టారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో కీలకమైన స్కూల్ గ్రాంట్స్ విడుదల కాకపోవడంపై 'చాకీపీసులు లేవు.. చార్జ్‌లు లేవు' శీర్షికన 'నమస్తే తెలంగాణ' గురువారం ఓ కథనాన్ని ప్రచురించిన విషయం విదితమే. దీనికి స్పందించిన డీఈవో సోమశేఖర శర్మ.. నిధుల విడుదల కోసం వెంటనే ఫైనాన్స్ అకౌంట్స్ ఆఫీసర్‌ని ఆదేశించారు. దీంతో ఎఫ్ఏవో కలెక్టర్‌కు ఫైల్ పెట్టారు. కలెక్టర్ అనుమతి రావడంతో పాఠశాలల బ్యాంక్ ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయి.

మధ్యాహ్న భోజనాన్ని ప్రతిరోజూ పరిశీలించాలి

ఖమ్మం డీఈవో సోమశేఖర శర్మ ఆదేశం..

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 19 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజూ పరిశీలించాలని డీఈవో సోమశేఖర శర్మ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులందరూ ప్రతీ బుధవారం ఒక్కో పాఠశాలను పరిశీలిస్తున్నారు. అక్కడే మధ్యాహ్న భోజనం చేసి దాని నాణ్యతను తనిఖీ చేస్తున్నారు. దీంతో నిర్వాహకులు కూడా బుధవారం ఒక్కరోజు మాత్రమే మధ్యాహ్న భోజనాన్ని నాణ్యంగా తయారు చేస్తున్నారు. మిగతా రోజుల్లో నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. దీంతో ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ 'బుధవారం ఒక్క రోజేనా..' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ' గురువారం ఓ కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన డీఈవో సోమశేఖర శర్మ.. పాఠశాలల బాధ్యులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలను, వాటిల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ప్రతీ బుధవారం జిల్లా అధికారులు పరిశీలిస్తారని అన్నారు. మిగిలిన రోజుల్లో ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, సెక్టోరల్ అధికారులు పరిశీలించాలని సూచించారు.

కార్మికులకు లాభాల వాటా ఇవ్వాలి

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దిండిగాల

జీఎం కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

ఏరియా జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 19 : సింగరేణి కార్మికులకు 32 నుంచి 35 శాతం వరకు లాభాల వాటా ప్రకటించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దిండిగాల రాజేందర్ డిమాండ్ చేశారు. కార్మికుల లాభాల వాటాను 32 నుంచి 35 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ ఎస్‌వోటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం లాభాల వాటా 16 శాతం ఇవ్వగా.. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో 32 శాతానికి పెంచిందన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసినప్పటికీ కార్మికుల బాగు గురించి పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు సిలివేరు సత్యనారాయణ, బావ్‌సింగ్, కౌన్సిలర్లు జేకే శ్రీను, సందా బిందు, జబ్బార్, గిన్నారపు రాజేశ్, మునిగంటి శివ, రాంలాల్ పాసి తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 19 : వాస్తవ లాభాలను ప్రకటించి సింగరేణి కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో మణుగూరు ఏరియా జీఎం కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి మాట్లాడుతూ 2023-24 సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు గడిచినా వాస్తవ లాభాల వెల్లడిలో జాప్యం జరగడంతో కార్మికుల్లో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. అనంతరం ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రామాచారి, బంగారి పవన్‌కుమార్, సింగర్ పవన్, రాజ్‌కుమార్, ఆపరేటర్ ముకేశ్, మునిగెల నాగేశ్వరరావు, మస్తాన్, మురళీకృష్ణ, రంపే శ్రీకాంత్, యెర్రపు వినయ్‌కుమార్, సత్యపాల్, సత్యనారాయణ, కనకయ్య, రేవన్, కుమారస్వామి పాల్గొన్నారు.

ఇందిరా డెయిరీ గ్రౌండింగ్‌కు..

కార్యాచరణ చేపట్టాలి

3 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి లక్ష్యంగా చర్యలు: కలెక్టర్

అధికారులతో సమీక్షిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 19: ఇందిరా డెయిరీ ఆధ్వర్యంలో మూడు లక్షల లీటర్ల పాల ఉత్పత్తి లక్ష్యంగా కార్యాచరణ చేపట్టాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఇందిరా డెయిరీపై అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఇందిరా డెయిరీని విజయవంతంగా నిర్వహించేందుకు, పాల ఉత్పత్తి, పాల సేకరణ, మార్కెటింగ్, రవాణా వంటి చర్యలకు పకడ్బందీ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఇదివరకే డెయిరీలకు పాలు సరఫరా చేస్తున్న వారికి, గేదెల పెంపకంలో అవగాహన ఉన్న వారికి, గేదెల షెడ్డు, పశుగ్రాసం లభ్యత ఉన్న వారికి మరో యూనిట్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మధిర నియోజకవర్గంలో 8 నుంచి 10 పాల సేకరణ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. కేంద్రం ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. పాల సేకరణ తరువాత చిల్లింగ్ యూనిట్‌కు తరలించే కార్యాచరణ ఉండాలన్నారు. 4 వేల నుంచి 5 వేల లీటర్ల పాల చిల్లింగ్ యూనిట్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. చిల్లింగ్ యూనిట్ కోసం గుర్తించిన భవనాలను రెన్నోవేషన్ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఇందిరా డెయిరీలో సభ్యత్వం ఉన్న 40 వేల మంది సభ్యులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తరగతుల వారీగా విభజించి.. వారికి ఆయా కార్పొరేషన్ల ద్వారా పాడి యూనిట్ల కొనుగోలుకు రుణ సౌకర్యం కల్పించాలని సూచించారు. డీఆర్‌డీవో సన్యాసయ్య, జిల్లా పశుసంవర్ధక అధికారి వేణుమనోహర్, ఎస్సీ సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు సత్యనారాయణ, బీసీ సంక్షేమాధికారి జ్యోతి, గిరిజన సంక్షేమాధికారి విజయలక్ష్మి, విజయ డెయిరీ ఉప సంచాలకులు మోహనమురళి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కన్నోళ్ల కళ్లముందే..

ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును బైక్‌పై వెళ్తూ ఢీకొట్టిన బాలుడు
అదే బస్సులో అతడి అమ్మానాన్న.. అందరితో కలిసి దిగి చూశాక దిగ్భ్రాంతి..
తీవ్రంగా గాయపడిన కొడుకును చూసి గుండెలు బాదుకున్న తల్లిదండ్రులు
డయాలసిస్ చేయించుకునేందుకు వెళ్తున్న తండ్రికి గుండెకోత మిగిల్చిన ప్రమాదం
కడుపారా కన్న కొడుకును కడసారిగా చూస్తున్నానంటూ బోరుమన్న కన్నతల్లి
భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెంలో ప్రమాదం.. మంగవాయిబాడవలో విషాదం..
అంతకు కొద్ది నిమిషాల ముందే వారిని బైక్‌పై తీసుకొచ్చి బస్టాప్‌లో దించిన కుమారుడు

బస్సు ముందు భాగాన ఢీకొని వెనుక భాగం వరకూ వచ్చిన బైకు

పర్ణశాల, సెప్టెంబర్ 19: విధి మిగిల్చిన విషాదకర ఘటన ఒకటి భద్రాద్రి జిల్లాలో చోటుచేసుకుంది. తాము ప్రయాణిస్తున్న బస్సును ఢీకొట్టి మరణశయ్యపైకి చేరుకోబోయేది తమ కన్న పేగేనన్న విషయం కొద్ది నిమిషాల వరకూ ఆ కన్నవాళ్లకు తెలియని విషాదం. తీరా దిగి చూశాక దిగ్భ్రాంతిని కలిగించే దృశ్యం. 'నా కొడుకో..' అంటూ ఒక్క ఉదుటున వెళ్లి రక్తపుమడుగులో ఉన్న తన కొడుకును గుండెలకు హత్తుకున్న ఆ తల్లి మమకారం. డయాలసిస్ చేయించుకునేందుకు వెళ్తున్న ఆ తండ్రి కూడా రోడ్డుపై జీవచ్ఛవంలా ఉన్న తన కొడుకును చూసి తల బాదుకున్న దయనీయ దృశ్యం. ఇవీ.. ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ప్రమాదంలో కన్నోళ్ల కళ్లెదుటే వారి కన్నపేగు ప్రాణాలతో కొట్టుమిట్టాడిన కలిచివేసే సన్నివేశాలు. అక్కడున్న వారందరినీ కదిలించిన కన్నీటి సాక్ష్యాలు.

భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం మంగవాయిబాడవ గ్రామానికి చెందిన పర్సిక గోపాలరావు కిడ్నీ వ్యాధిగ్రస్తుడు. అతడికి భార్య సావిత్ర, కుమారుడు దీపక్ (16) ఉన్నారు. గురువారం ఉదయం గోపాలరావు డయాలసిస్ చేయించుకునేందుకు తన భార్య సావిత్రితో కలిసి భద్రాచలానికి పయనమయ్యాడు. తమను బస్టాప్ వద్ద దించాలని చెప్పడంతో కొడుకు దీపక్ వెంటనే తన బైక్ తీశాడు. వారిని ఎక్కించుకొని సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న రహదారి వద్దకు తీసుకొచ్చాడు. బస్సు రాగానే ఎక్కి వెళ్లాలంటూ జాగ్రత్తలు చెప్పాడు. తాను చెప్పులు కొనుక్కునేందుకు వెళ్తున్నానంటూ అదే భద్రాచలం మార్గంలోని లక్ష్మీనగరం వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని తిరుగు పయనమయ్యాడు. ఈ క్రమంలో దుమ్ముగూడెం క్రాస్ రోడ్డు సమీపంలో ఓ ఆటోను దాటి వెళ్లేందుకు ప్రయత్నించాడు. అప్పటికే అతడికి ఎదురుగా భద్రాచలం వెళ్లే ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు వస్తోంది. ఆ ఆటోను ఓవర్ టేక్ చేసే క్రమంలో దీపక్ బైక్ హ్యాండిల్ బస్సు ముందు భాగానికి తగిలింది. ఈ వేగానికి అతడు వెంటనే కింద పడి బస్సు వెనుక టైర్ల వరకూ వెళ్లాడు. బైక్ కూడా అదే వేగానికి బస్సు వెనుక భాగాన్ని దాటి వెళ్లింది. అయితే ఓ బైక్ బస్సును ఢీకొట్టిన విషయాన్ని బస్సు డ్రైవర్, అందులోని ప్రయాణికులు గమనించారు. వెంటనే బస్సును పక్కకు ఆపగా అందరూ వచ్చి చూస్తున్నారు. ఈ క్రమంలో గోపాలరావు, సావిత్రి కూడా వచ్చి చూశారు. అక్కడ రక్తపు మడుగులో పడి ఉన్నది తమ కుమారుడేనని గుర్తించి గుండెలు బాదుకున్నారు. అప్పటికే తీవ్ర గాయాలపాలై స్పృహ తప్పి పడి ఉన్న అతడిని ఒడిలోకి తీసుకొని బోరున విలపించారు. వెంటనే ఓ ఆటోను పిలిపించి దుమ్ముగూడెంలోని ములకపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే ఆ బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. కడుపారా తాము కన్న కొడుకు తమ కళ్లముందే ప్రాణాలు విడిచాడంటూ ఆ కన్న తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటున్న దృశ్యాలు అక్కడున్న అందరినీ కంటతడి పెట్టించాయి. కాగా, ఈ ఘటనపై దుమ్ముగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాగుపడిన గండి..

- పాలేరు పాత కాల్వకు పూర్తయిన మరమ్మతు పనులు
- 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు
- 200 క్యూసెక్కుల నీరు ఇవ్వాలని రైతుల డిమాండ్

గండిపడిన ప్రాంతంలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు

కూసుమంచి, సెప్టెంబర్ 19 : గండిపడిన పాలేరు పాత కాల్వ మరమ్మతు పనులను నీటిపారుదల శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. గురువారం 100 క్యూసెక్కుల నీటిని ముందస్తుగా విడుదల చేసిన అధికారులు ఆ ప్రాంతంలో దగ్గరుండి పర్యవేక్షించారు. పాలేరు రిజర్వాయర్ పరిధిలోని నేలకొండపల్లి, కూసుమంచి మండలాలకు చెందిన సుమారు 20 వేల ఎకరాలకు నీరందించే పాలేరు పాత కాల్వకు ఈ నెల ఒకటో తేదీన భారీ వర్షంతోపాటు వరద రావడంతో గండిపడింది. దీంతో నీటిపారుదల శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం నాలుగు దఫాలుగా కాల్వ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులు సాగునీటి కోసం ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో నీటిపారుదల శాఖ అధికారులు సీఈ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఈఈ మంగలపుడి వెంకటేశ్వర్లు, డీఈలు మన్మథరావు, రమేశ్‌రెడ్డి, రత్నకుమారి గండి మరమ్మతు పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. గురువారం మధ్యాహ్నం వరకు పనులన్నీ పూర్తి చేసి కాల్వ ద్వారా ముందుగా 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

నీటి సామర్థ్యం పెంచాలని రైతుల వినతి

జిల్లాలో 15 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలు, వరదలతో పాలేరు పాత కాల్వ కింద కనుచూపు మేరలో పొలాలు, పంటచేలు పూర్తిగా నీట మునిగాయి. క్రమంగా వర్షాలు తగ్గుముఖం పట్టడం.. నాలుగు రోజులుగా ఎండల తీవ్రత పెరగడంతో పొలాలకు నీటి అవసరం రావడం.. పైనుంచి సాగర్ నీరు రాకపోవడంతో సాగు రైతులు నీటి కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు గురువారం పాలేరు పాత కాల్వ గండికి మరమ్మతు పూర్తి చేసి 100 క్యూసెక్కుల నీటిని వదలగా.. తమ పంట భూములకు 200 క్యూసెక్కుల నీరు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎగువ ప్రాంతాల్లోని పంట పొలాలకు నీరు చేరదన్నారు. అయితే 'పాలేరు పాత కాల్వ గండి పనులు గురువారం పూర్తయ్యాయి. ఇప్పుడే కాల్వ నుంచి నీటి ప్రవాహం ఎక్కువగా వెళితే మళ్లీ గండి పడే ప్రమాదం ఉంటుంది. ఒకటి, రెండు రోజుల్లో కట్ట బలపడుతుంది. అప్పుడు కావాల్సినంత నీటిని రైతులకు అందిస్తాం' అని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు

భద్రాచలం, సెప్టెంబర్ 19: ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని పెండింగ్‌లో కేసులను పరిష్కరించుకోవాలని భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులతో కోర్టు ఆవరణలో ప్రత్యేక సమావేశం న